# రాచపీనుగు తోడులేకుండా వెళ్లదు

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

౧

లోకంలో పెట్టుబడి లేని వృత్తులు రెండే వున్నాయి. ఒకటి బ్రాహ్మణవృత్తీ, రెండోది క్షత్రియవృత్తీనీ. బ్రాహ్మణుడు "భవతి భిక్షాం దేహి" అంటూ చెంబు పుచ్చుకుని బయలు దేరాడంటే వర్ణాశ్రమాచారాలమీద అభిమానం వున్న యిల్లాళ్లంతా తలో పిడికెడు బియ్యమూ వేస్తారు. పూర్వకాలం సంగతి చెప్పలేం గాని యీవృత్తిలో యిప్పుడు వేలు సంపాదించి వడ్డీవ్యాపారంలోకి దిగినవాళ్లున్నారు.

ఇక క్షత్రియవృత్తి సంగతి. ఇదీ తలో కాస్తా యిచ్చేదే; కాని యివ్వడంలోనూ, యిచ్చే వస్తువులోనూ, పుచ్చుకోవడంలోనూ కూడా భేదం వుంది. భేదం అంటే కాస్తా కూస్తా కాదు; ఏనుక్కీ దోమకీ వున్నంత తేడా వుంది. ఆ వృత్తికి మొగమ్మీద దైన్యం తాండవం చేస్తూవుంటుంది. ఈ వృత్తికి శౌర్యం నృత్యం చేస్తూ వుంటుంది. క్షత్రియుడు కత్తి దూసి నుంచున్నాడంటే కనుచూపుమేర వెనకా, ముందూ, పక్కల్నీ కూడా హాడల్. అందరూ అతనికి పాదాక్రాంతు లవుతారు. అతని ప్రభుత్వాన్ని శిరసావహిస్తారు. తమ కష్టార్జితంలో కొంతభాగం పన్ను అని పేరుపెట్టి అతని పాదాలదగ్గిర చెల్లించి, "మహాప్రభూ! నీ బిడ్డలం. మమ్మల్ని రక్షించు" అంటూ పడి పడి దణ్ణాలు పెడతారు.

డబ్బు సంపాదించడంలో దానికి కింది మెట్టూ, దీనికి పైమెట్టూ యిక ప్రపంచకంలో మరేమీ లేవు.

అయితే బ్రాహ్మణ వృత్తికి వున్నవూరు విడవనక్కరలేదు. క్షత్రియవృత్తికి వూరేగాదు, వొకొక్కప్పుడు దేశమూ, చివరికి ప్రాణాలూ కూడా విడవ్వలిసివస్తుంది.

౨

వొకమాటు యిలాగే తటస్థించింది. అయిదు గోత్రాలకు చెందిన అయిదుగురు క్షత్రియవీరులు వున్నచోట లొంగసాను రాగా దూరదేశంలో డబ్బూ, పదవులూ, వీలయితే రాజ్యాలూ సంపాదించుకోవాలని కుటుంబాలతో బయలుదేరారు. దారి పొడుగునా తమ లాంటివారే కొందరు కొంతకొంత ప్రదేశాన్ని ఆక్రమించుకొని హద్దు లేర్పరచుకొని వుండగా వారింకా ముందుకు సాగారు. చివరికి వొక తురక రాజ్యం తగిలింది. నవాబు చేతికింద అనేకమంది సామంతు లున్నారనీ, వీరుడు వస్తే అతను పోనివ్వక జాగీరిచ్చి నిలుపుతా డనీ వారికి తెలిసింది. వాకబు మీద అక్కడ

అలాంటి పదవులు సంపాదించడం తమికి కష్టంలోది కాదని కూడా తెలిసింది. ఇలా తెలవడంతోటే వారక్కడ ఆగిపోయి వొక సత్రంలో బసచేసి నవాబు చహారంతా వాకబు చేశారు.

వారయిదుగురూ వొకనాడు నవాబు దర్శనానికి బయలుదేరారు. అసలే క్షత్రియులు; అందులోనూ ఆకొన్న సింహాలు; ఇక తేజస్సుకి లోటేమిటి? గాని అలాంటి శౌర్యరాసులు పెద్దబజారులో కాలినడకను వెడుతూ వుంటే ప్రజలంతా చాలాచాలా నొచ్చుకున్నారు.

దేవిడీదగ్గిరికి వెళ్లాటప్పటికి మొదటిద్వారంలో వారి నడ్డుకున్నవారు లేరు. రెండో ద్వారంలో కూడా పలకరించినవారు లేకపోయారు. మూడో ద్వారంలో వున్నవాడు అడగాలని కొంచెం వూగీసలాడాడు గాని ధైర్యం చాలింది కాదు. నాలుగు—అయిదు—ఆరు—యీద్వారాల్లో వున్నవాళ్లు ప్రశ్నించడం మానలేదు; గాని వీరు చెప్పింది వినబడకపోగా చివరికి తామడిగింది కూడా వాళ్లకి జ్ఞాపకం లేకపోయింది. కాని యేడో ద్వారంలో వున్నవాళ్లు సామాన్యులుకారు. అది దాటితే యిక దర్బారే; కనక అక్కడ వుక్కుతునకల్లాంటివాళ్లున్నారు. ఈ సంగతి కనిపెట్టి క్షత్రియులు, వాళ్లేమీ అడక్కముందే తమకి తామేనుంచుని, "నవాబుగారి దర్శనం కావా" లన్నారు. కానయితే "కావా"లంటే ప్రార్థించడమే; గాని నడికట్లలో కటారులూ, చేతుల్లో పట్టాకత్తులూ, చూపుల్లో కరుకుతనమూ, మీసాల్లో శౌర్యస్ఫురణా—ముఖమ్మీద వీరతేజస్సూ చూశాటప్పటికి వాళ్లకి ఆ 'కావా' లన్నమాట కేవలమూ హుజూరుహుకుం కంటేనూ కూడా యెక్కువగా తోచింది. ఆకారణంచేత వారిలో వొకడు లోపలికి వెళ్లి సెలవు పొంది వచ్చి వారిని తీసుకువెళ్లి నవాబు యెదుట హాజరు పెట్టాడు.

## 3

దర్బారంతా కిటకిటలాడిపోతోంది. వజీర్లూ, ఫౌజుదార్లూ, సరదార్లూ, జాగీరుదార్లూ, రాయబారులూ, అంతా యిలాంటి ప్రజ్ఞావంతులేగాని అక్కడ కేవలం మనుష్యులెవ్వరూ లేరు. రాచవారిని చూసి అలాంటివారంతా చకితులై పోయారు.

రాజులు వీరనమస్కారాలు చేసి పంచపాండవుల్లాగ నుంచోగా నవాబు కూచోమని తల వూపాడు. తరవాత నవాబుయింగితం కనిపెట్టి రాజులలో మొనగాడు లేచి యిలా అన్నాడు:—

"మేము చాలా దూరాన్నుంచి వస్తున్నాం. మేము క్షత్రియులం. మాది యోధజాతి. అంటే మేము కత్తి పట్టడానికే పుట్టాం."

"................"

"ప్రాణాలు పోయాకే మా చేతిలో వున్న కత్తి కింద బడిపోతుంది."

"అంటే?"

"అంటే యేం వుందీ? ఎదటివాణ్ణి చంపకుండా క్షత్రియుడు చావడు. రాచపీనుగు తోడు లేకుండా వెళ్లదు"

"చాలా సాహసమైన మాట."

"క్షత్రియజాతియొక్క సాహసానికి యీ మాటలో వుండుకున్న సాహసం సూచకం మాత్రమే—"

"ఏ జాతిలోనైనా చాలామంది శూరులు వుండవచ్చును. ఎదటివాణ్ణి కొట్టినా కొట్టకపోయినా తాము పోరుతూనే చచ్చిపోవచ్చును; గాని పోడిచిగాని చచ్చిపో మనడం నమ్మరాని మాట."

"తమ కలా తోచడం మాకు భాగ్యమే. అవునంటే కాదంటూ వాగ్వాదం పెంచడానికిది శాస్త్రవిషయం కాదు. ఇది ప్రత్యక్ష విషయం."

"అవును."

"తమరు పరీక్షించవచ్చు."

"ఎలాగా?"

"మాలో వొకడు తమ సమక్షంలో నుంచుంటాడు. తమ సర్దార్లలో తమ యిష్టం వచ్చినవాణ్ణి తుపాకి యిచ్చి మావాడికి పదిగజాలలో నుంచోమని తుపాకి పేల్చవలసిందని సెలవివ్వండి."

"తరువాత?"

"మా వాడు ముందు గుండుదెబ్బ తింటాడు."

"తిని?"

"తిని వెంటనే తను సర్దారుని పొడిచేస్తాడు."

"....................."

"తరవాతే మావాడు పడిపోతాడు."

అంతటి దర్బారులో యిలాంటి అమానుష ప్రతిజ్ఞ నిదివరకెవరూ విని అయినా వుండలేదు. ఉన్నవారిలో విన్నవారంతా చకితులైనారు. సరదార్లంతా వజీర్లకేసి చూడగా వజీర్లు నవాబుకేసి చూశారు. నవాబు రాచవారిని చూసి నిరుత్తరుడైనాడు.

కొంతసేపు యెవరూ యేమీ మాట్లాడలేదు. మాట్లాడడానికిందులో సందేహమెక్కడా? నమ్మడానికిది అశ్రుతపూర్వం. నమ్మకపోదామంటే రాజులు సవాలు చేస్తున్నారు.

మరికొంతసేపటికి నవాబు "మూడుగంటలికి పరీక్ష" అని క్షత్రియులకు సెలవిచ్చాడు. వజీరు ఆజ్ఞచేత రాచవారికి ఆతిథ్య సత్కారాలు చెయ్యడానికి వొక సర్దారు వారికూడా సత్రానికి వెళ్లాడు.

౪

మూడయింది. దర్బారంతా యిసకవేస్తే రాలకుండా కిక్కిరిసి పోయి వుంది. ఆరుగురు క్షత్రియులు రాగా సభ్యులంతా విరగబడి చూశారు. ఉచితమర్యాదలైన తరవాత రాజుల మొనగాడు "మా వాడు సిద్ధం" అని చెప్పగా నవాబు వొక వజీరుకేసి చూశాడు.

ఆ వజీరు వొక సర్దారుకేసి చూడగా అతగాడు లేచి 'తయా'రన్నాడు.

రాజులలో మొనగాడికొడుకు ముందు తండ్రికీ, తరవాత తక్కిన నలుగురు క్షత్రియులికీ పాదాభివందనం చెయ్యగా వారైదుగురూ అతని శిరస్సుమీద చేతులు వుంచి దీవించారు.

ఆ దీవనలు శిరసావహించి, రాచకుమారుడు నవాబుకి సలాం చేసి, కైజారుపిడిమీద కుడిచేతి నుంచుకొని, యుక్తస్థలంలో నుంచోగా, సరిగా అతనికి పదిగజాల దూరంలో దట్టించిన తుపాకీ పట్టుకుని, తురకసరదారు నుంచున్నాడు.

యోధుల హృదయాలుగూడా గుబగుబలాడిపోతున్నాయి. తక్కినవారి చూపులు చెదిరిపోతున్నాయి.

చూసిచూసి, నవాబు కన్ను గీటాడు. తుపాకి 'ధా'మ్మంది. ఆ అగావుకి మూతలుపడ్డ దర్బారుకళ్లు మళ్లీ తెరుచుకునేటప్పటికి దెబ్బ తిన్న రాచకుమారుడు చర్రున కైజారు దూసి, చెంగున ముందు కురికాడు; గాని అయిదు గజాలలో పడిపోయాడు. దానికే దర్బారంతా ఆశ్చర్యపడింది. నవాబు మందహాసం చేశాడు.

కాని రాజుల మొనగాడిదేమీ మూడలేదు. కుర్చీలోనుంచి వొక్క వుడాం వేశాడతను. పడిపోయివున్న కొడుకు చేతికైజారు వు ళొక్కని మెరుపులాగ బసలోకి పరిగెత్తాడు. కారణం తెలవక వున్నవారందరూ—నవాబు గూడా-తెల్లపోగా, తక్కిన క్షత్రియులు సంగతులన్నీ గ్రహించి, "మావాడు మళ్లీ యిప్పుడే వస్తాడు. ఎవరూ తొందరపడవద్దు" అని చెప్పారు.

౫

అక్కడ—బసలో భార్య ప్రత్యుత్థానం చెయ్యగా మొనగాడు కైజా రెత్తి, "నిజంచెప్పు. నీపెద్దకొడుక్కి తండ్రి యెవడు?" అని వురిమాడు. రాచకుమాళ్ల కిలాంటి వురుములు నేర్పే మాత ఆమె. క్షణంలో సంగతంతా గ్రహించింది. వెంటనే పైట తొలగించుకొని గుండెలిచ్చి నిలిచి, ఉరగాంగనలాగ వులుకూ వులుకూ చూస్తూ, "ముందు పొడిచేసి, తరవాత అడిగినా జవాబు చెబుతాను. ఏం? పెద్దబ్బాయి రసాభాసం చేసాడా? అనుకుంటూనే వున్నాను. అయినా అనుగ్రహం వుంటే వివరాలు చెప్పండి" అంది.

మొనగాడికి మెరుపుదెబ్బ తగిలినట్లయింది. "అనుకుంటూనే" వుంది. ఆకళ్లల్లో ఎంత శౌర్యం తొణికిపోతోంది? అలాంటిస్త్రీ స్తన్యం తాగినందు కేనా ఆ రాచకుమారుడు తండ్రి మాట నిలిపివుండవలసింది.

కోపం తగ్గలేదు; గాని వుద్ధృతం అణిగింది. మొలకట్టులో పెట్టలేదు, గాని కైజారు కిందికి దింపాడు. జరిగిందంతా చెప్పి అతను "ఏం చెబుతా" వన్నట్లుగా కనుబొమ్మ లెగరేశాడు.

"ఎప్పుడు పుట్టిందో మావంశం. మా తల్లులూ, మాతల్లుల తల్లులూ, వారి పూర్వు

లూ గూడా యెవ్వడూ వేలుపెట్టి చూపించుకోలేదు."

"......................"

"గాని మీకిప్పు డిలాంటి సందేహం కలగడంలో ఆశ్చర్యం లేదు."

"......................"

"కారణం కూడా లేకపోలేదు."

"......................"

"పెద్దబ్బాయి పుట్టినప్పుడు నాదగ్గిర పాలు చాలలేదు. అబ్బాయి వెంకటలక్ష్మిపాలతో పెరిగాడు."

దీనితో మొనగాడికి నెమరు తిరిగింది. దాసిపాలు అయిదుగజాల వెనక్కి లాగేశాయి. "ముందు పరీక్షచేసి పంపవలసింది" అని మనస్సు అనగా "అలాంటివాడు పోవడమే మంచిది" అని బుద్ధి చెప్పింది.

"దర్బారులో యేం జరిగిందీ ?"

"అబ్బాయి అలా పడ్డాడు. నేనిలా వురికాను. అప్పు డక్కడ లేకపోవడమే మంచిది వుంటే యేం దుష్టుమాట చెవిని బడి వుండునో."

"ఇప్పుడైతే యేమీా ? చిన్నబ్బాయిని తీసుగువెళ్లండి."

తల్లియిలా చెప్పేటప్పటికి రెండోకొడుకు "బాబయ్యగారూ! నేను వస్తాను పదండి" అని ముందుకు వచ్చాడు. తండ్రి 'రా' అన్నాడు. తల్లి దీవించింది.

"వెడుతున్నాను. వీలయితే అబ్బాయి కీర్తిని తీసుకువస్తాను. లేకపోతే—లేకపోతే—"

"ఆ కైజా రిలా యిచ్చి వెళ్లండి."

కైజారు ఇవ్వడంలోనూ, పుచ్చుకోవడంలోనూ చెయ్యీ చెయ్యీ తగిలేయి. ఉభయ విద్యుత్తులూ కలిసినట్లయింది. ఆ వుద్రిక్త శౌర్యాన్ని వారిద్దరూ కొడుకులో లీనం చేశారు.

౬

దర్బారంతా సంగతి వినడానికి ఔత్సుక్యం చూపింది; గాని మొనగాడు "ఇప్పుడు పరీక్ష చేయించండి. ఇది చివరిది" అన్నాడు.

"ఇలాంటి అసాధ్యప్రతిజ్ఞ తీర్చుకోవడం కోసం రత్నాలవంటి కొడుకుల్ని బలి యిచ్చుకోవడం మంచిదా ?" అని నవా బడిగాడు.

"నా కొడుకులు రత్నాలవంటి వాళ్లని తమరు సెలవిచ్చారు. నా పెద్దకొడుకు అలా నడిదారిలో పడివున్నప్పుడు తమ స్తుతి నింద అవుతోంది గాని ప్రశంస కావడంలేదు. మళ్లీ తనిఖీచేయించండి" అని మొనగాడు మళ్లీ కోరాడు.

నవాబు దర్బారంతా కళవళపడుతూ వుండడం చూశాడు. గాని యిలాంటి ప్రాణోత్క్రమణాలు లక్షలకొద్దీ చూసిన కళ్లవి. శౌర్యప్రస్తావన వచ్చినప్పుడు కొబ్బరిచెట్టుమీాద నుంచి పుచ్చె పడడం యెలాంటిదో మనిషి మెడ మీాదనుంచి తలకాయ పడడమూ అలాంటిదే,

పైగా యిప్పుడు విషయ్మానికి చెందిన శౌర్యాన్ని పరీక్షించడం. నవాబు వెంటనే అంగీకరించాడు.

తండ్రి తన అన్నగారి కళేబరాన్ని వొక పక్కకి తీసెయ్యగా రాచబిడ్డ వెళ్లి కైజాప పిడిమీద కుడిచేతి నుంచుకొని నుంచున్నాడు.

తురక సర్దారు తుపాకీ దట్టించుకొని నుంచున్నాడు. మొనగాడు చూపుతూపులతో కొడుకు శౌర్యాన్ని గుచ్చిగుచ్చి రేపెడుతున్నాడు.

నవాబు మళ్లీ కన్ను గీటాడు. తుపాకీ మళ్లీ 'ఢా'మ్మంది. సరదారు రాచకుమారుడు గుండుదెబ్బ తినడమూ, కైజారు దుయ్యడమూ, ముందు కురకడమూ కూడా యెరగడు. కెవ్వన కేకమాత్రం వేశా డతను.

నిదానించి చూడగా తురకసర్దారూ, రాచకుమారుడూ వొకరిపక్కని వొకరు పడివున్నారు. సరదారు పేగులు బైటికి వచ్చివున్నాయి.

దర్బారంతా స్తబ్ధమై పోయింది. నవాబు లేచి మందగమనంతో దగ్గిరికి వచ్చి సలాం చేసి 'సెబాస్' అన్నాడు.

ఇద్దరు కొడుకుల్ని యేక కాలంలో పోగొట్టుకున్న రాజుల మొనగాడు నవాబు ప్రశంసని ఆనందతరంగితాలై యున్న కళ్లతో అందుకున్నాడు.

తమకు కలిగిన గౌరవభావం వల్లనూ, నవాబు ఆజ్ఞవల్లనూ దర్బారులో వున్నవారంతా పడివున్న రాచకుమాళ్లని గౌరవించారు. నవాబు వారి దహనసంస్కారానికి తన వుద్యానవనంలో స్థలం యేర్పాటు చేయించాడు. నవాబు సేనాసాగరం ఆ వుద్యానవనాన్ని ముంచివేసింది.

నవాబు క్షత్రియవీరులికి జాగీరు లిచ్చాడు. సైన్యాధిపత్యం యిచ్చాడు. తన దర్బారులో యెగువ పీటలిచ్చాడు. కనకాభిషేకం చేశాడు.

క్షత్రియులు నవాబు ఋణం తీర్చుకున్నారు. ముఖ్యంగా మొనగాడు చేసిన వుపకారం నవాబుకి పరిమితం లేనిది. బ్రతికి వున్నంత కాలమూ అతను నవాబుకి కుడిభుజంగా వుండి చివరికి భార్యతో కూడా అవ్యయానంద నిలయంలో వున్న కుమాళ్లని కలుసుకున్నాడు.

అతని వంశం అంతటితో సరి. అందుచేతనే ఆంధ్రక్షత్రియులలో ఇప్పుడు నాలుగు గోత్రాలు మట్టుకే వున్నాయి.

---